కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

జ్యోతినగర్(రామగుండం), అక్టోబర్ 24: బీఆర్ఎస్ హయాంలో మంజూరైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుధవారం ప్రారంభించడంతో బీఆర్ఎస్ శ్రేణులు గురువారం సంబురాలు జరిపారు. రామగుండంలోని 20వ డివిజన్‌లో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నియోజకవర్గ ప్రజలు పెద్దపల్లికి వెళ్లకుండా అందుబాటులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంజూరు చేయించారని గుర్తుచేశారు. నేడు సబ్ రిజిస్ట్రార్ సేవలు అందుబాటులో వచ్చాయని పేర్కొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ రామగుండం పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు ఉప్పరి లక్ష్మణ్, శివరాత్రి గంగాధర్, సారయ్య నాయక్, వేణుగోపాల్, మల్లేశ్, షేక్ ఇంతియాజ్, జశ్వంత్, అశోక్, ప్రశాంత్, ప్రసాద్, రాజు, సతీశ్ ఉన్నారు.

నామినేటెడ్ పదవుల జాప్యంపై నారాజ్

ఏఎంసీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ నాయకుల నిరీక్షణ

కమాన్‌పూర్,అక్టోబర్ 24: మండలంలోని కాంగ్రెస్ నాయకులు పార్టీ తీరుపై నారాజ్ అవుతున్నారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. మార్కెట్ కమిటీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ముగ్గురు చైర్మన్ పదవిని చేపట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి అధికారంలో ఉండడంతో నామినేటెడ్ పోస్టుల కోసం నాయకులు నిరీక్షిస్తున్నారు. కమాన్‌పూర్, రామగిరి, ముత్తా రం మండలాల నుంచి రోజు రోజుకూ ఆశావహుల సంఖ్య పెరిగిపోతున్నది. ఈ పర్యాయం కమాన్‌పూర్‌కు చెందిన వారికే మార్కెట్ కమిటీ పదవి ఇవ్వాలని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి దృష్టి లో ఏముందో, ఎవరున్నారో అనేది అంతుచిక్కడం లేదు. మార్కెట్ పాలక వర్గాన్ని పది నెలలుగా నియమించకపోవడంపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతుంది.

సరిహద్దు జిల్లాల సమావేశానికి రామగుండం సీపీ

హెలికాప్టర్‌లో గడ్చిరోలికి చేరుకున్న రామగుండం సీపీ

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 24: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులతో గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో అక్కడి డీఐజీ అంకిత్ గోయల్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ హాజరై సమావేశానికి అధ్యక్షత వహించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు చర్చించారు.ఈ సమావేశానికి సీపీ శ్రీనివాస్ రామగుండం కమిషనరేట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గడ్చిరోలికి చేరుకున్నారు. ఇక్కడ గడ్చిరోలి ఆపరేషన్ సీఆర్పీఎఫ్ డీఐజీ అజయ్‌శర్మ, ఆయా రాష్ట్రాల ఎస్పీలు, జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 24: ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే స్వప్నారాణి అన్నారు. పెద్దకల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్‌నేరాలు పెరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 15100 కు కాల్ చేస్తే ఉచితంగా న్యాయసేవలందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని జడ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, న్యాయవాదులు ఠాకూర్ హన్మాన్‌సింగ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబురాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్24: కాల్వ శ్రీరాంపూర్– ఓదెల మండలంలోని పొత్కపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు రూ .25కోట్లు మంజూరు చేయించారని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పందిళ్లలో కాంగ్రెస్ నాయకులు గురువారం సంబురాలు జరిపారు. ఓదెల మండలం రూపునారాయణపేట నుంచి జమ్మికుంట మండలం విలాసాగర్ మధ్యన గల మానేరు నదిపై వంతెన నిర్మాణాకి రూ. 80 కోట్లు, ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయం నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పోచంపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 10.95కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, నాయకులు అటికం శంకర్, రామిడి తిరుపతిరెడ్డి, మునీర్, మాదాసి సతీశ్, శివరామకృష్ణ, ఇల్లందుల రమేశ్ పాల్గొన్నారు.

కోదండరామాలయంలో పంచామృతాభిషేకం

పాలకుర్తి, అక్టోబర్24: పునర్వసు నక్షత్రం సందర్భంగా ఈసాలతక్కళ్లపల్లి కోదండరామాలయంలో గురువారం మూలవిరాట్ శ్రీరాముడికి మహిళలు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారి ఆరుట్ల హరీశ్ పంచామృతాభిషేకం విశిష్టతను వివరించారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునగా ఏమనగా శ్రీమతి ఈదునూరి స్వర్ణలత భర్త: రమేష్ వయస్సు: 33 సం॥లు వృత్తి: బిజినెస్, గ్రా॥ తుర్కలమద్దికుంట, మం&జిల్లా పెద్దపల్లి గ్రామ పంచాయితీ తుర్కల మద్దికుంట కోడ్ నెంబర్: 201, యందలి సర్వేనెం. 363/5, విస్తీర్ణము: 605-00 చ.గలు సరియగు 505.84 చ.మీ. గల ఖాళీస్థలమునకు ప్లాన్ జతపరిచిన ప్రకారం హద్దులు కలవు. ఉత్తరం: 12ఫీట్ల దారి, దక్షిణం: ఈదునూరి సత్తయ్య గారి ఖాళీ స్థలం, తూర్పు: 9ఫీట్ల స్వంత దారి, పడమర: ఈదునూరి రాయలింగయ్య గారి ఖాళీస్థలం లో గల యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి

నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 6 రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: Sd/- పెన్నంటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

నివాళి

మంథని/మంథని రూరల్, అక్టోబర్ 24: పట్టణంలోని శ్రీ శీలేశ్వశ్వర-సిద్ధేశ్వర దేవాలయం ఏరియాలోని చౌడారపు అమృతమ్మ మృతి చెందగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ గురువారం నివాళులర్పించారు. కుమారుడు ప్రకాశ్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మం థని మండలం నాగారం గ్రామానికి చెందిన గాజుల దుర్గమ్మ, బూడిద వెంకటి, అనసూరి రాజేశం, ఉడుత నల్ల మల్లయ్య ఇటీవల మృతి చెంద గా, ఆ కుటుంబాలను మధూకర్ పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మడ్డి చంద్రయ్య కాలికి శస్త్ర చికిత్స చేయించుకోగా పరామర్శించారు.

మంథనికి ఉచితంగా ఇసుక ఇప్పించాలి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- సాండ్ టాక్స్ ఎత్తేయాలని కలెక్టర్‌కు వినతి

మాట్లాడుతున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పెద్దపల్లి, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): పేదల అవసరాలకు అందుబాటులో ఉన్న ఇసుకను పెద్దపల్లి నియోజకవర్గంలో ఉచితంగా సరఫరా చేస్తున్నారని, మంత్రికి చేతనైతే మంథనిలో కూడా స్థానిక అవసరాలకు పైసా ఖర్చు లేకుండా ఇసుకను సరఫరా చేయించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిశారు. మంథనిలో సాండ్ టాక్సీ లేకుండా ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే పేద వర్గాల కోసం గొప్ప నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. మంథని ఎమ్మెల్యేకు ఈ ఆలోచన ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. గతంలో ఇసుక తరలిస్తున్నారని ఆరోపించిన ఎమ్మెల్యే ఇప్పుడ ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన వ్యాఖ్యలు అధికారపక్షంలోకి వచ్చాక మర్చిపోయారా..? అని ఎద్దేవా చేశారు. గతంలో శ్రీధర్‌బాబు మాట్లాడిన మాటలను ట్యాబ్‌లో ప్లే చేసి మీడియాకు చూపించారు. పెద్దపల్లిలో స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుక ఇస్తుంటే, పక్కనే మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మంథనిలో సాండ్ టాక్స్ ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్థాయి వాళ్లు మాత్రమే ప్రజల గురించి ఆలోచన చేస్తారా..? మంత్రి అయితే ప్రజల గురించి పట్టింపు ఉండదా అని విమర్శించారు. మంథని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఇక్కడ ఉండరని, ఈ ప్రాంత ప్రజల అవసరాలు వాళ్లకు తెలియదని విమర్శించారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే కళ్లు తెరిచి పేదల కోసం ఆలోచన చేయాలని హితవు పలికారు. అధికారులకు చేతనైతే పెద్దపల్లిలో అమలు చేస్తున్న విధానాన్ని మంథనిలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెద్దపల్లిలో సాండ్ టాక్స్ అమలు చేయవద్దన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, పూదరి సత్యనారాయణ గౌడ్, శంకేసి రవీందర్, మాదరవేన కుమార్‌యాదవ్, కాపరబోయిన భాస్కర్, గాజుల ప్రసాద్, మైదం కుమార్, రొడ్డ శ్రీనివాస్, ఎలువాక రాజన్న, అల్లం తిరుపతి పాల్గొన్నారు.

కోతలు లేకుండా వడ్లు కొనాలి

పెద్దపల్లి టౌన్ : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లి, అక్టోబర్ 24: పెద్దపల్లి నియోజకవర్గంలో ఎలాంటి కోతలు లేకుండా వడ్లు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సంబంధిత అధికారులకు సూచించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో హాకా (హైదరాబాద్ అగ్రికల్చర్ కో –ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సన్న, దొడ్డు వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలన్నారు. నిర్ణీత తేమ శాతం ఉన్న వడ్లను మాత్రమే తూకం వేయాలని సూచించారు. తూకంలో తేడా రాకుండా చూసుకోవాలని హమాలీలకు సూచించారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను విడుదల చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, జిల్లా మార్కెటింగ్ కమిటీ మేనేజర్ పీ ప్రవీణ్ కుమార్, ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్, కార్యదర్శి సతీశ్, హాకా మేనేజర్ కృష్ణయ్య, డీవీహెచ్‌వో డాక్టర్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు గోపాగాని సారయ్య గౌడ్, ప్రకాశ్‌రావు, జడల సురేందర్, నూగిళ్ల మల్లయ్య, సంపత్, గుండేటి ఐలయ్య, ఎస్ రాజేందర్, తమ్మడబోయిన ఓదెల యాదవ్, సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 24: పట్టణంలోని ఆర్కే గార్డెన్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని దాదాపు 2 వందల మందికి చెక్కులు అందజేసినట్లు వెల్లడించారు. ఇక్కడ తహసీల్దార్ రాజ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ జడ్పీటీసీ బండారు రామ్మూర్తి, కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, నాయకులు మాదిరెడ్డి నర్సింహారెడ్డి, బొడ్డుపల్లి శ్రీనివాస్, కట్కూరి సుధాకర్‌రెడ్డి, కడార్ల శ్రీనివాస్, కొమ్ము శ్రీనివాస్, శోభ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 24: కష్టపడి కొన్న భూమి వివాదంలో ఉండడం, మరో వైపు అప్పుల బాధతో తాళలేక మనస్తాపానికి గురైన సింగరేణి కార్మికుడు మాదంశెట్టి నర్సయ్య(58) బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విఠల్‌నగర్ కు చెందిన నర్సయ్య సింగరేణి ఓసీపీ 3లో డంపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఏడేళ్ల క్రితం కరీంనగర్ బైపాస్‌లో భూమి కొనుగోలు చేశాడు. భూమి కొనుగోలు సమయంలో అప్పు చేశాడు. ఇదే సమయంలో ఆ భూమి వివాదంలో చిక్కుకుంది. దీంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. అప్పుల భారం, స్థల వివాదంతో మానస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం పురు గుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి గురువారం చనిపోయాడు. నర్సయ్యకు భార్యశోభ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రాకేశ్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రదానం

కోల్‌సిటీ, అక్టోబర్ 24: నర్సయ్య(58) కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి మృతుడి కుటుంబానికి నేత్రదానంపై అవగాహన కల్పించగా వారు ముందుకు వచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు దవాఖాన టెక్నీషియన్ సతీశ్ నేత్రాలు సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఇక్కడ సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, నాయకులు బోళ్ల చంద్రశేఖర్, రఘుపతి,గౌడ్, లయన్స్‌క్లబ్ సభ్యులు మల్లికార్జున్, సానా రామకృష్ణరెడ్డి ఉన్నారు.

ఠాణాల్లో ఓపెన్ హౌస్

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 24: పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని పలు ఠాణాల్లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసుల విధులు, స్టేషన్ల నిర్వహణ, ఆయుధాల పనితీరు, శాంతి భద్రతల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఇక్కడ సుల్తానాబాద్ సీఐ సబ్బారెడ్డి, ఎస్ఐ లక్ష్మణరావు, గాయత్రి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మంథని, అక్టోబర్ 24: మంథని పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల చెందిన విద్యార్థులతో పాటు ప్రజలకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పోలీసుల విధి నిర్వహణ, ఆయుధాలు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో కలుషిత నీరు..

గోదావరిఖని, అక్టోబర్ 24: రామగుండంలోని పరిశ్రమల వ్యర్థాల ద్వారా వస్తున్న రసాయనాలతో గోదావరి కలుషితమై విషపూరితంగా మారుతుందని, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా స్థానిక పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మద్దెల దినేశ్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏళ్ల తరబడి కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు విన్నవిస్తున్నా నిర్లక్ష్యం చూపుతున్నారని పేర్కొన్నారు. గోదావరి నీటి కలుషితంపై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ, కేంద్ర కాలుష్య నియంత్రణశాఖ, రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్‌కు ఎక్స్(ట్విట్టర్) ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులు

శ్రీనివాస్ రాజ్‌కుమార్

పెద్దపల్లి/ఓదెల, అక్టోబర్ 24: మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన పలువురికి చోటు దక్కింది. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నగునూరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా బండారి రాజ్‌కుమార్ నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్ గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. తమ నియామ కానికి సహకరించిన రాష్ట్ర నాయకులు, జిల్లాలోని మీసేవ నిర్వాహకులకు శ్రీనివాస్, రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పశువైద్య శిబిరం

ఎలిగేడు, అక్టోబర్ 24: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నారాయణపల్లిలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ ఝాన్సీ తెలిపారు. గోపాలమిత్ర సమ్మయ్య,రైతులు పాల్గొన్నారు.

కనీస విద్యా ప్రమాణాలు అందాలి

పాలకుర్తి, అక్టోబర్24: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి కనీస విద్యాప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. పాలకుర్తి మండలం కుక్కలగూడూర్, జయ్యారం ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, పుట్నూర్ కేజీబీవీని కలెక్టర్ గురువారం సందర్శించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పౌష్టికాహారంలో నాణ్యత ప్రమాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వంటసిబ్బందిని ఆదేశించారు. పుట్నూర్ ఆరోగ్యకేంద్రంలో రోగులకు అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి

పెద్దపల్లి, అక్టోబర్ 24: జిల్లాలో డిసెంబర్ నాటికి కొత్తగా వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ మొక్కల గ్రౌండింగ్‌పై కలెక్టరేట్‌లో గురువారం ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత సంవత్సరం నూతనంగా 324 ఎకరాల్లో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేశామని, మరో 350 ఎకరాల్లో ప్లాంటేషన్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొత్తగా నిర్దేశించిన వెయ్యి ఎకరాలు సాగు లక్ష్యంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీహెచ్ఎస్‌వో జగన్మోహన్ రెడ్డి, ఏడీఏ కాంతారావు, హార్టికల్చర్ అధికారులు జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూ సేకరణ సమస్యలను పరిష్కరించాలి

రామగిరి, అక్టోబర్ 24: మండలంలోని బుధవారంపేట, రాజాపూర్ గ్రామాలలో సింగరేణి చేపట్టిన భూసేకరణ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. రామగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. బుధవారంపేట, రాజాపూర్‌లో భూసేకరణకు సంబంధించి ఎంజాయిమెంట్ సర్వే పూర్తయిందని, అవార్డులపై రైతులు అందించే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలో మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ సకాలంలో వాటిని జారీ చేయాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో తాసీల్దార్, అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కమాన్‌పూర్, అక్టోబర్ 24: కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ గురువారం తనిఖీ చేశారు. తహసీల్దార్ వాసంతిని మండలంలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు జారీ చేయాలనీ, ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తసీల్దార్ వాసంతి, నాయబ్ తాసీల్దార్ రాజేంద్ర ప్రసాద్, సీనియర్ సహాయకులు సతీష్, సహాకులు కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

మహిళా న్యాయవాదుల చలో ఖమ్మం

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 24: ఐలు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26,27 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న మహిళా న్యాయవాదుల రాష్ట్రస్థాయి సమావేశాలకు మహిళా న్యాయవాదులు తరలిరావాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోశిక ప్రకాశ్, మహమ్మద్ ఉమర్, ఉపాధ్యక్షుడు అజయ్, కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగం–మహిళా న్యాయవాదుల పాత్ర అనే అంశంపై సమావేశంలో చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ రాజగోపాల్, జీ విద్యాసాగర్, కొల్లి సత్యనారాయణ, ఐలు మహిళా న్యాయవాద కన్వీనింగ్ కమిటీ కో ఆర్డినేటర్ వనజ ప్రసంగించనున్నట్లు తెలిపారు. అనంతరం సమావేశంలో భవిష్యత్ కార్యకలపాలు, నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని వివరించారు.

కేశోరాం క్యాంటీన్ పరిశీలన

పాలకుర్తి, అక్టోబర్24: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి, కర్మాగారం సీవోవో అభయ్ దాదిచ్, హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ పార్థసారధిలతో కలిసి కర్మాగారం క్యాంటీన్‌ను గురువారం పరిశీలించారు. క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, సౌకర్యాలు కల్పించాలని కోరారు. వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

పరామర్శ

జూలపల్లి, అక్టోబర్ 24 : జూలపల్లిలో పలు కుటుంబాలను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ గురువారం పరామర్శించారు. ఏదుల్ల కనుకయ్య భార్య గ్రేసీ విక్టోరియా, నెరువట్ల దుర్గాస్వామి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను రఘువీర్ సింగ్ పరామర్శించి ఓదార్చారు. ఇక్కడ జూలపల్లి సింగిల్ విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య, నాయకులు పొలవేని సతీశ్, మేరశ్రీనివాస్, బండి రాజయ్య, సిలివేరు మహేశ్, తాజొద్దీన్, మానుమండ్ల శ్రీనివాస్, మొదుంపెల్లి భూమయ్య, నెరువట్ల ఆనంద్ పాల్గొన్నారు.

సింగరేణిలో దీపావళి బోనస్

గోదావరిఖని, అక్టోబర్ 24: సింగరేణిలో దీపావళి పండుగ బోనస్ రూ.93,750 ఈ నెల 25న కార్మికులకు, ఉద్యోగులకు చెల్లించేందుకు యాజమాన్యం నిర్ణయించినట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31న దీపావళి పండుగను పురస్కరించుకొని బోనస్ చెల్లించాలని గుర్తింపు సంఘం కోరగా స్పందించిన యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల ఫలితాలు

ఎన్నికైన మత్స్యశాఖ డైరెక్టర్లు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్24: కూనారం–మంగపేట గ్రామ మత్స్యశాఖ సహకార సంఘం ఎన్నికల ఫలితాలను పోలీస్ బందోబస్తు మధ్య గురువారం ఎన్నికల అధికారి పలకల సురేందర్‌రెడ్డి ప్రకటించారు. 2022ఆగస్టు 22న మత్స్యశాఖ సహకార సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఫలితాలను నిలిపి వేయాలని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఫలితాలను నిలిపి వేయాలని ఆదేశించింది. తిరిగి ఇటీవల ఎన్నికల ఫలితాలను విడుదల చేయాలని హైకోర్టు ఉత్తర్వులు విడుదల చేయడంతో హైకోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం మత్స్యశాఖ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహించారు. మత్స్యశాఖ డైరెక్టర్లుగా ఎలవేన స్వామి, కంకణాల నర్సయ్య, జంగిటి సదయ్య, జంగిటి సదానందం, పెండెం రాజేశం, జంగిటి కొమురయ్య, పిట్టల సదానందం, ముడుసు రాజు, చంచు రమేశ్ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను శుక్రవారం సహకార సంఘం కార్యాలయంలో నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. ఫలితాల విడుదల సందర్భంగా ముదిరాజ్‌లు హర్షం వ్యక్తం చేస్తూ పటాకులు పేల్చారు. ఇక్కడ సీఈవో బోడకుంట్ల విజేందర్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, నరేశ్, ఏఎస్ఐ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సాయమేదీ?

పెద్దపల్లి టౌన్, అక్టోబర్24: యాసంగి, వానకాలం సీజన్ పూర్తి కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతుకు రూ. 15వేలు ఇవ్వలేదని, రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తానని మాట తప్పడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి విమర్శించారు. పెద్దపల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని మండిపడ్డారు. కనీసం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల నిధులు విడుదల చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, జంగ చక్రధర్‌రెడ్డి, అక్కెపల్లి క్రాంతికుమార్, పర్శ సమయ్య, రాజవీరు, దిలీప్, సతీశ్, కరుణాకర్, పుట్ట రవి, మంథన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వంపై హర్షం

మంథని, అక్టోబర్ 24: ఐక్యరాజ్య సమితిలో భారత దేశం శాశ్వత సభ్యత్వం పొందడంపై బీజేపీ నాయకులు సత్యప్రకాశ్, సబ్బని సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. మంథనిలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం వారు మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 65 ఏళ్లు అధికారంలో ఉన్నా ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పదేళ్లలోనే ఐక్యరాజ్య సమితిలో భారతదేశానికి శాశ్వత సభ్యత్వం దక్కిందన్నారు. ఇందుకు ప్రధాని మోదీ పాలన, దౌత్యమే కారణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగోజు శ్రీనివాస్, రాపర్తి సంతోష్, చిలువేరి సతీశ్, రమేశ్, లక్ష్మణ్, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

మంథని, అక్టోబర్ 24: మంథని మున్సిపాలిటి పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ కోరారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ, కమిషనర్ మనోహర్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

18 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

గోదావరిఖని, అక్టోబర్ 24: సింగరేణి ఆర్జీ–1 పరిధిలో 18 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అందజేశారు. ఈ మేరకు గురువారం స్థానిక జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్, చనిపోయిన ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగుల డిపెండెంట్స్‌కు చెందిన వారికి జీఎం నియామక ఉత్తర్వు కాపీలు అందజేశారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతి, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవోలు శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, జీఎం ఆఫీస్ ప్రతినిధి రాజు, సంతోష్ ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రామగిరి, అక్టోబర్ 24: క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అడ్రియాల ప్రాజెక్టు జీఎం కే వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్‌అయిన మృతి చెందిన ఉద్యోగుల డిపెండెంట్లకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను ఇటీవల జారీ చేశారు. అందులో 31 మంది అభ్యర్థులకు సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో డిస్మిస్ అయి తిరిగి బదిలీ వర్కర్లుగా నియమితులైన 11 మందికి స్థానిక ఎంవీటీసీలో జరుగుతున్న శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, డీఏస్ఈ శ్రీనివాస్, బోధకుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు పట్టివేత

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 24: ఎల్కలపల్లి ఎన్టీపీసీ రైల్వేట్రాక్ వద్ద వ్యాగన్ల నుంచి చోరీ చేసిన బొగ్గును సింగరేణి ఆర్జీ–1 ఎస్ అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, అక్బర్ అలీ గురువారం పట్టుకున్నారు. అక్రమార్కులు బొగ్గు చోరీ చేసినట్లు అందిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి బొగ్గును స్వాధీన పరుచుకున్నారు. ఈ బొగ్గు ఖరీదు రూ.5వేల వరకు ఉంటుందన్నారు. ఎస్ అడ్‌పీసీ షిఫ్ట్ జిమేదార్ శ్రీనివాస్, ఇంటలిజెన్స్ రాధాకృష్ణ, ఏసీటీఎస్ టీమ్ కోల రాజు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

పత్తి పరిశీలన

పెద్దపల్లి, అక్టోబర్24: పెద్దపల్లి ఏఎంసీలోకి వచ్చిన పత్తిని మార్కెట్ అధికారులు, సీసీఐ అధికారి గురువారం పరిశీలించారు. పత్తి నాణ్యత, తేమ శాతం, ధరలను చూశారు. పత్తిలో 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర రూ. 7521 చెల్లించి సీసీఐ కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఇక్కడ డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, సీసీఐ అధికారి రత్నాకర్, ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్, గ్రేడ్ –2 సెక్రటరీ సతీశ్, మిల్లు యాజమానులు, రైతులు పాల్గొన్నారు.